# బీమా.. బీఆర్ఎస్ కార్యకర్తలకు ధీమా

- రానున్న ప్రతి ఎన్నికల్లోనూ మన పార్టీదే ఘన విజయం
- తాండూరు మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

మృతుడు నర్సింహులు భార్య లక్ష్మికి రూ.2 లక్షల ప్రమాద బీమాను అందజేస్తున్న రోహిత్‌రెడ్డి

తాండూరు, జనవరి 31: పార్టీ కోసం నిరంతరం శ్రమించే కార్యకర్తలకు అండగా ఉండేలా ప్రమాద బీమా సౌకర్యాన్ని కల్పిస్తున్నామని తాండూరు మాజీ ఎమ్మెల్యే పంజుగుల రోహిత్‌రెడ్డి పేర్కొన్నారు. పెద్దేముల్ మండల పరిధిలోని అడ్కిచర్ల గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త చాకలి నర్సింహులు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుడు బీఆర్ఎస్ సభ్యత్వం కలిగి ఉండడంతో పార్టీ సమూహ ప్రమాద బీమా నుంచి మంజూరైన రూ.2 లక్షల చెక్కును మృతుడి భార్య లక్ష్మికి శుక్రవారం తాండూరు బీఆర్ఎస్ కార్యాలయంలో ఆయన స్థానిక నేతలతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ సభ్యత్వం తీసుకున్న ప్రతి సభ్యుడి కుటుంబానికి 'నేనున్నా' నంటూ బీఆర్ఎస్ అధిష్ఠానం భరోసా కల్పిస్తున్నదన్నారు. ఆ కుటుంబాలకు ఎంతో కొంత పార్టీ ద్వారా ఆర్థికసాయం అందుతున్నదన్నారు. పార్టీ కోసం పని చేసిన ప్రతి ఒక్కరికీ అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పెద్దేముల్ మండల అధ్యక్షుడు కోహిర్ శ్రీనివాస్, సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి ఉన్నారు.

### బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ కార్యకర్తలు

యాలాల మండల పరిధిలోని పగిడ్యాల గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు శుక్రవారం మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. బీఆర్ఎస్‌లో చేరిన మల్లేశ్, సాయిలుతో పాటు పలువురు మాట్లాడుతూ.. మోసపూరిత హామీలతో గెలిచిన కాంగ్రెస్‌కు త్వరలో వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెబుతామన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన గ్యారెంటీల్లోని హామీలన్నీ గారడీలేనన్నారు. పింఛన్‌ను రూ.4 వేలకు పెంచలేదని, ఏడాదిలోనే 2 లక్షల ఉద్యోగాలు భర్తీ ఎక్కడ..? యువతకు ఇస్తామన్న రూ.10 లక్షల వడ్డీ లేని రుణాలు ఏమయ్యాయి..? రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ ఎంతమందికి అయింది..? రైతు భరోసా ఎక్కడ అని ప్రశ్నించారు. ఇవన్నీ నచ్చకపోవడంతోనే కాంగ్రెస్‌ను వదిలి బీఆర్ఎస్‌లో చేరినట్లు వెల్లడించారు. ప్రజలను ఇబ్బంది పెడుతున్న కాంగ్రెస్‌ను బొందపెడుతామన్నారు. మాజీ ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పాలనలో జరిగిన అభివృద్ధిని వివరించారు. పార్టీ బలోపేతానికి అందరూ కలిసికట్టుగా ఉండాలన్నారు. రానున్న ప్రతి ఎన్నికల్లోనూ బీఆర్ఎస్సే ఘన విజయం సాధిస్తుందన్నారు. బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు నిరుత్సాహ పడకుండా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చేంతవరకు పోరాటం చేయాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ యాలాల మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, నాయకులు మల్లారెడ్డి, బసిరెడ్డి ఉన్నారు.

రోహిత్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ కార్యకర్తలు

పరిగి డీఎస్పీ కార్యాలయం వద్ద మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

# కాంగ్రెస్ సర్కారు కుట్రలు

- అంబేద్కర్ విగ్రహావిష్కరణ అనుమతికి చివరి వరకు సాగదీత
- పరిగి డీఎస్పీ కార్యాలయానికి చేరుకొని మాట్లాడిన మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి
- రాత్రి 9 గంటలకు అనుమతి ఇచ్చిన పోలీసులు

ప్రభుత్వ తీరును నిరసిస్తూ బీఆర్ఎస్ శ్రేణుల నిరసన ర్యాలీ

పరిగి, జనవరి 31 : ఏ కార్యక్రమం నిర్వహించేందుకు అనుమతి కోరినా కాంగ్రెస్ సర్కారు కుట్రలకు తెరలేపుతున్నది. పరిగి నియోజకవర్గం కులకచర్ల మండల పరిధిలోని దాస్యనాయక్‌తండాలో రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణకు శనివారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరు కానున్న సందర్భంలో అనుమతి ఇవ్వడంలో ప్రభుత్వం మరోసారి కుట్రపూరితంగా వ్యవహరించిందనే విమర్శలు వచ్చాయి. అనుమతి కోసం సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు శంకర్ ముందుగానే దరఖాస్తు చేసుకున్నా శుక్రవారం సాయంత్రం వరకు అనుమతి ఇవ్వకుండా పోలీసులు నాన్చారు. సభ నిర్వహించే భూ యజమానులు సైతం ఎన్‌వీసీ ఇచ్చినా అనుమతి ఇచ్చేందుకు పోలీసులు శుక్రవారం రాత్రి వరకు సాగదీశారు. శుక్రవారం సాయంత్రం 7 గంటల ప్రాంతంలో పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి, బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి డీఎస్పీ కార్యాలయానికి వెళ్లి డీఎస్పీ శ్రీనివాస్‌తో అంబేద్కర్ విగ్రహావిష్కరణ సభకు అనుమతిపై చర్చించారు. సుమారు గంట సమయం అక్కడే ఉన్న మాజీ ఎమ్మెల్యే అన్ని అంశాలపై పోలీసులతో మాట్లాడారు. శాంతియుతంగా సమావేశం నిర్వహించుకునేందుకు ఏర్పాట్లు చేసుకోగా అనుమతి ఇవ్వకపోవడం సరికాదన్నారు. కొద్దిసేపట్లో అనుమతి ఇస్తాను.. మీరు వెళ్లండంటూ డీఎస్పీ సూచించడంతో మహేశ్‌రెడ్డి స్వగృహానికి వెళ్లగా రాత్రి 9 వరకు పోలీసులు అనుమతి ఇవ్వకపోవడంతో ఆగ్రహించిన బీఆర్ఎస్ శ్రేణులు పరిగిలోని జాతీయ రహదారిపై నిరసన ర్యాలీ నిర్వహించారు. మరోసారి మహేశ్‌రెడ్డి డీఎస్పీ కార్యాలయానికి వెళ్లగా పోలీసులు సభకు అనుమతి ఇచ్చారు. ఫిబ్రవరి ఒకటో తేదీ మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు సభ నిర్వహణకు పోలీసులు అనుమతి ఇచ్చారు. నిరసన ర్యాలీలో పరిగి మాజీ మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎ.సురేందర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఆర్.ఆంజనేయులు, దోమ మాజీ వైస్ ఎంపీపీ మల్లేశం, దోమ మండల సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు రాజిరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు గోపాల్, బి.రవికుమార్, వారాల రవీంద్ర, ఎదిరె కృష్ణ, నజీర్, హాజీ అమిరొద్దీన్, రవి, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహావిష్కరణలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు జైపాల్‌యాదవ్, చల్లా వంశీచంద్‌రెడ్డి

## సర్వాయి పాపన్న జీవితం ఆదర్శనీయం

ఆమనగల్లు, జనవరి 31: సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జీవితం అందరికీ ఆదర్శనీయమని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు జైపాల్‌యాదవ్, చల్లా వంశీచంద్‌రెడ్డి, పుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి, పీసీబీ సభ్యుడు ఠాగూర్ బాలాజీసింగ్ అన్నారు. పట్టణంలోని కాటమయ్య గుట్టపై గౌడ సంక్షేమ సంఘం, శ్రీకంఠ మహేశ్వర స్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈ విగ్రహాన్ని శుక్రవారం వారు ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడారు. సర్వాయి పాపన్న పోరాట పటిమ, సేవ నిరతి అందరికీ స్ఫూర్తిదాయకమన్నారు. ఆమనగల్లులో పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఏర్పాటు చేసిన గౌడ సంఘం నాయకులను అభినందించారు. కార్యక్రమంలో గౌడ సంఘం తాలూకా అధ్యక్షుడు. ఆలయ చైర్మన్ చుక్క అల్లాజీ గౌడ్, జనరల్ సెక్రటరీ గంగా రవి గౌడ్, సంఘం మండల అధ్యక్షుడు చుక్క నిరంజన్ గౌడ్, టాస్క్ సీవోవో సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి, బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజాల శ్రీనివాస్ గౌడ్, బీసీ జన సైన్యం రాష్ట్ర అధ్యక్షుడు నాగేశ్ గౌడ్, బీసీ సమైక్య రాష్ట్ర అధ్యక్షుడు దుర్గయ్య గౌడ్, బీసీ సంఘం రాష్ట్ర నాయకులు వెంకన్న గౌడ్, పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్, డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్, ఏఎంసీ చైర్పర్సన్ యాట గీతానర్సింహా, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

## వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపన

ఆమనగల్లు, జనవరి 31 : పట్టణంలోని కంఠమహేశ్వర స్వామి ఆలయ ఆవరణలో నూతనంగా నిర్మించిన పబ్బతి ఆంజనేయ స్వామి, రేణుకా ఎల్లమ్మ, మైసమ్మ తల్లి, నవగ్రహాలు, కౌండిన్య మహర్షి ఆలయాల్లో విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలు శుక్రవారం భక్తి శ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. వేడుకలకు పట్టణంతో పాటు కల్వకుర్తి నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి గౌడ సంఘం నాయకులు, భక్తులు, మహిళలు, అధిక సంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమానికి కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు జైపాల్‌యాదవ్, వంశీ, పుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి. రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సభ్యుడు ఠాగూర్ బాలాజీసింగ్, టాస్క్ సీవోవో సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి, బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజాల శ్రీనివాస్ గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఆలయ చైర్మన్ చుక్క అల్లాజీ గౌడ్, ప్రధాన కార్యదర్శి గంగా రవీందర్ గౌడ్, జాయింట్ సెక్రటరీ చుక్క నిరంజన్‌గౌడ్ ఆధ్వర్యంలో వేడుకలకు ఏర్పాట్లు చేశారు. అంతకు ముందు ఆలయ ఆవరణలో హోమం, ప్రత్యేక పూజలు, నిర్వహించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. విగ్రహాల దాత గుజ్జల మహేశ్‌ను గౌడ సంఘం నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్, ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.


ఆలయంలో పూజలు నిర్వహించిన రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి

## వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

### స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

బైక్ ర్యాలీలో పాల్గొన్న స్పీకర్, కలెక్టర్, ఎస్పీ

వికారాబాద్, జనవరి 31 : వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రమాదాల నివారణకు కృషి చేయాలని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పిలుపునిచ్చారు. జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం వికారాబాద్‌లో నిర్వహించిన హెల్మెట్ ఉపయోగంపై అవగాహన, బైక్ ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని సూచించారు. ప్రమాదాలకు గురికాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కార్లు నడిపే వారు సీటు బెల్టు తప్పనిసరిగా ధరించాలన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్పీ నారాయణ రెడ్డి, రోడ్డు రవాణా అధికారి వెంకట్ రెడ్డి, ఆర్టీఏ సభ్యుడు జాఫర్, ఆర్డీవో వాసు చంద్ర తదితరులు పాల్గొన్నారు.

### బీఈడీ పరీక్ష ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 31: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని బీఈడీ పరీక్ష ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. బీఈడీ మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్ష ఫీజును ఈనెల 21వ తేదీలోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. రూ.200 అపరాధ రుసుముతో 22వ తేదీ వరకు చెల్లించవచ్చన్నారు. ఈ పరీక్షలను వచ్చే నెలలోనే నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూడొచ్చని తెలిపారు.

### ఐదేళ్ల ఎంబీఏ పరీక్ష తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 31: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని బీబీఏ/ఎంబీఏ ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సు పరీక్ష తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సు మొదటి, మూడు, అయిదు, ఏడు, తొమ్మిదో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలను ఈనెల 14వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

### పీజీ వన్‌టైం చాన్స్ పరీక్ష తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 31: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని పీజీ కోర్సుల వన్‌టైం చాన్స్ పరీక్ష తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఏ, ఎంకామ్, ఎంఎస్‌డబ్ల్యూ, ఎంసీజే, ఎంలిబ్ఎస్సీ కోర్సుల అన్ని సెమిస్టర్ల వన్‌టైం చాన్స్ పరీక్షలను ఈనెల 5వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

## దొంగతనాలకు పాల్పడుతున్న కిలేడీ అరెస్టు

స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలను పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీనివాస్

### 11.8 తులాల బంగారం, రూ.80వేలు స్వాధీనం

పరిగి, జనవరి 31 : ఆర్టీసీ బస్టాండ్లు, రద్దీ అధికంగా ఉండే బస్సుల ప్రయాణికుల వద్ద దొంగతనాలకు పాల్పడుతున్న కిలేడీ'ని పోలీసులు పట్టుకున్నారు. ఇటీవల జిల్లాలోని పరిగి, వికారాబాద్ బస్టాండ్లలో ఐదు దొంగతనాలు జరిగాయి. ఈ దొంగతనాలకు పాల్పడిన మహిళను పోలీసులు పట్టుకోగా, ఇందుకు సూత్రధారి పరారీలో ఉన్నాడు. శుక్రవారం పరిగిలోని పోలీసు సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ శ్రీనివాస్ అందించిన వివరాలు.. యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరిలోని సీతనగర్‌కు చెందిన పసుపులేటి అమూల్య ఆర్టీసీ బస్టాండ్లు, రద్దీ ఉండే ప్రదేశాల్లో ఈ దొంగతనాలకు పాల్పడుతున్నది.

### ఎస్పీ ఆధ్వర్యంలో ప్రత్యేక టీం

ఇటీవల బస్టాండ్‌ల్లో దొంగతనాలు జరుగుతుండడంతో ఎస్పీ నారాయణ రెడ్డి దొంగలను పట్టుకునేందుకు ప్రత్యేక టీం ఏర్పాటు చేశారు. సీసీఎస్ సీఐలు బలవంతయ్య, అన్వర్‌పాషా నేతృత్వంలోని టీం ప్రత్యేకంగా నిఘా వేసి అమూల్యను పట్టుకున్నారు. రద్దీగా ఉండే బస్సుల వద్ద ప్రయాణికుల వద్ద నుంచి పర్సులు, సెల్‌ఫోన్‌లు, బంగారు ఆభరణాలు దొంగిలిస్తున్నది. 2024 జూన్ 5న వికారాబాద్‌లో ఆర్టీసీ బస్సులో ఎక్కుతున్న ప్రయాణికురాలి నుంచి రెండు తులాలు బంగారు పుస్తెలతాడు చోరీకి పాల్పడింది. 2024 ఆగస్టు 23న పరిగి బస్టాండ్‌లో ఒక ప్రయాణికురాలి నుంచి 6.8తులాల బంగారు గొలుసు, రెండు బంగారు చెవిదిద్దులు దొంగిలించింది. 2024 డిసెంబర్ 27న వికారాబాద్ బస్టాండ్‌లో ఒక ప్రయాణికురాలి నుంచి రూ.1,60,000 నగదు ఉన్న బ్యాగ్‌ను దొంగతనం చేసింది. 2025 జనవరి 7న పరిగి బస్టాండ్‌లో ఒక ప్రయాణికురాలి వద్ద నుంచి ఒక తులం విలువ చేసే బంగారు గుండ్లు, బంగారు పత్తిలు, 11న ఒక ప్రయాణికురాలి నుంచి రెండు తులాల బంగారు పుస్తెలతాడు దొంగతనం చేసింది.

నిందితురాలు అమూల్య

### సీసీఎస్ పోలీసుల నిఘా

సీసీఎస్ పోలీసులు నిఘా వేసి పట్టుకొని విచారించగా అమూల్య దొంగతనానికి పాల్పడినట్లు అంగీకరించింది. అమూల్య జిల్లాలో 5 దొంగతనాలకు పాల్పడి 11 తులాల 8 గ్రాముల బంగారం, రూ.లక్షా 60 వేల నగదు దొంగిలించింది. ఆమె వద్ద నుంచి 11 తులాల 8 గ్రాముల బంగారం, రూ.80వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. అమూల్యను అరెస్టు చేశామని, రిమాండ్‌కు తరలించనున్నట్లు పేర్కొన్నారు. దొంగతనాలకు సంబంధించి దిశా నిర్దేశకుడిగా ఉన్న హైదరాబాద్‌లోని ఆసిఫ్‌నగర్‌కు చెందిన మహ్మద్ ఇక్బాల్ పరారీలో ఉన్నాడు. ఈ కేసులను చేధించిన సీసీఎస్ ఇన్స్పెక్టర్లు బలవంతయ్య, అన్వర్‌పాషా, సీసీఎస్ పోలీసు సిబ్బంది జయవర్ధన్, శివకుమార్, చెన్నయ్య, రామకృష్ణ, గోవింద్, రాఘవేందర్‌రెడ్డి, కృష్ణారెడ్డిని డీఎస్పీ అభినందించారు. కార్యక్రమంలో సీఐ శ్రీనివాస్‌రెడ్డి, పరిగి ఎస్సై సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

# తగ్గిన ఎంపీటీసీ స్థానాలు

- గతంలో 13.. నేడు 11 స్థానాలకు నోటిఫికేషన్ జారీ
- పరిగి మున్సిపాలిటీలో ఐదు గ్రామాలు విలీనం
- అభ్యంతరాల అనంతరం ఫిబ్రవరి 3న తుది జాబితా : ఎంపీడీవో వెల్లడి

పరిగి మండల ప్రజా పరిషత్ కార్యాలయం

పరిగి, జనవరి 31 : మండల పరిధిలోని ఐదు గ్రామ పంచాయతీలను పరిగి మున్సిపాలిటీలో విలీనం చేసినందున మిగతా గ్రామాలతో 11 ఎంపీటీసీ స్థానాలకు కలెక్టర్ నోటిఫికేషన్ విడుదల చేశారు. గతంలో పరిగి మండల పరిధిలో 13 ఎంపీటీసీ స్థానాలుండగా ఐదు గ్రామ పంచాయతీలు మున్సిపాలిటీలో విలీనంతో ఎంపీటీసీ స్థానాల సంఖ్య 11కు తగ్గింది. 2011 జనాభా ప్రకారం 11 ఎంపీటీసీ నియోజకవర్గాల నోటిఫికేషన్ విడుదల చేశారు. బర్కత్‌పల్లి ఎంపీటీసీ పరిధిలో బర్కత్‌పల్లి, లక్నాపూర్, చిగురాల్‌పల్లి గ్రామ పంచాయతీలు (3,442 జనాభా), మాధారం ఎంపీటీసీ పరిధిలో మాధారం, పేట మాధారం, బసిరెడ్డిపల్లి, రంగాపూర్ (4,534 జనాభా), మిట్టకోడూర్ ఎంపీటీసీ పరిధిలో మిట్టకోడూర్, గోవిందాపూర్ (3350 జనాభా), చిట్యాల్ ఎంపీటీసీ పరిధిలో చిట్యాల్, తొండపల్లి, యాబాజీగూడ (4,174 జనాభా), గడిసింగాపూర్ ఎంపీటీసీ పరిధిలో గడిసింగాపూర్, హీర్యానాయక్‌తండా, ఇబ్రహీంపూర్, మల్కాయ్‌పేట్‌తండా, రూప్‌సింగ్‌తండా(4,343 జనాభా), కాళ్లాపూర్ ఎంపీటీసీ పరిధిలో ఖుదావంద్‌పూర్, జాఫర్‌పల్లి, కాళ్లాపూర్ (3,115 జనాభా), రూప్‌ఖాన్‌పేట్ ఎంపీటీసీ పరిధిలో రూప్‌ఖాన్‌పేట్ (3,115 జనాభా), రాపోల్ ఎంపీటీసీ పరిధిలో రాపోల్, పోల్కంపల్లి, నర్సయ్యగూడ (2,857 జనాభా), సయ్యద్‌పల్లి ఎంపీటీసీ పరిధిలో సయ్యద్‌పల్లి, రావులపల్లి (2,615 జనాభా), నారాయణపూర్ ఎంపీటీసీ పరిధిలో రాఘవాపూర్, నారాయణపూర్, లక్ష్మీదేవిపల్లి (2,749 జనాభా), రంగంపల్లి ఎంపీటీసీ పరిధిలో రంగంపల్లి, షోండేపూర్‌తండా, సాలిప్పలబాటతండా గ్రామపంచాయతీలు (2,631 జనాభా)తో ఎంపీటీసీ స్థానాలకు నోటిఫికేషన్ విడుదల చేశారు. నోటిఫికేషన్‌ను పరిగిలోని మండల పరిషత్ కార్యాలయంలో పబ్లిష్ చేశారు. వీటిపై అభ్యంతరాలను స్వీకరించి ఫిబ్రవరి 3న తుది జాబితాను ప్రకటిస్తామని ఎంపీడీవో పేర్కొన్నారు.

### అభ్యంతరాలకు సమయమేదీ?

ఎంపీటీసీ స్థానాల నోటిఫికేషన్‌ను జనవరి 30న విడుదల చేసిన అధికారులు బయటకు పొక్కకుండా చూడడం అనేక అనుమానాలకు తావిస్తున్నది. నోటిఫికేషన్‌పై అభ్యంతరాలను జనవరి 30, 31 తేదీల్లో తెలియజేయాలని, ఫిబ్రవరి 3న ఫైనల్ పబ్లికేషన్ ఉంటుందని ప్రకటించారు. కానీ ఎంపీటీసీ స్థానాల నోటిఫికేషన్ ప్రెస్‌నోట్ 31వ తేదీ సాయంత్రం ఇవ్వడం చూస్తుంటే అసలు అభ్యంతరాలు తెలియజేసేందుకు ప్రజలకు సమయం ఇవ్వకుండానే, తెలియకుండానే అధికారులు చేసిందే ఆమోదం పొందేలా, ఫైనల్ పబ్లికేషన్ వెలువరించేందుకు ఏర్పాట్లు చేపట్టారనే విమర్శలు వినిపిస్తున్నాయి. కేవలం నామ్‌కే వాస్తేగా అభ్యంతరాలకు సమయం ఇచ్చి, నోటిఫికేషన్ అంశం ప్రజా బాహుళ్యంలో పెట్టకుండా ఫైనల్ పబ్లికేషన్‌కు ఏర్పాట్లు చేయడం సరైన పద్ధతి కాదని పలువురు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా కలెక్టర్ వెంటనే చర్యలు తీసుకొని అభ్యంతరాలకు సమయం ఇవ్వాలని కోరుతున్నారు.

## నకిలీ నోట్లు ఇచ్చి మోసం చేశారని ఆందోళన

సీఎస్సీ నిర్వాహకుడు తనకు ఇచ్చిన నోట్లు ఇవేనంటూ చూపిస్తున్న సుగుణమ్మ

పరిగి, జనవరి 31 : పంట రుణం డబ్బులు సీఎస్సీ కేంద్రంలో డ్రా చేయగా తనకు నకిలీవి (పిల్లలు ఆడుకునేవి) ఇచ్చారని పేర్కొంటూ ఓ మహిళ ఆందోళన చేపట్టింది. వివరాల్లోకి వెళ్తే.. పరిగి పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన బ్యాగరి సుగుణమ్మకు పంటరుణం మంజూరు కాగా ఆ డబ్బులను సీఎస్సీ కేంద్రంలో డ్రా చేసుకోవాల్సిందిగా బ్యాంకు అధికారులు సూచించారు. జనవరి 24న పట్టణంలోని మినీ స్టేడియం సమీపంలో ఉన్న సీఎస్సీ కేంద్రంలో ఆమె రూ.30వేలు నగదు డ్రా చేసుకున్నది. మొత్తం రూ.500నోట్లు ఇచ్చారు. డబ్బులు కవర్‌లో పెట్టి అలాగే ఇంట్లో పెట్టానని, పొలం పనులు ఉండడంతో తాను డబ్బులు తీయలేదని తెలిపారు. శుక్రవారం గ్రూపు డబ్బులు చెల్లించేందుకు వాటిని తీయగా నకిలీవని తేలినట్లు సుగుణమ్మ పేర్కొన్నారు. వెంటనే ఆమె సీఎస్సీ కేంద్రానికి వచ్చి నకిలీ నోట్లు ఇచ్చావని ప్రశ్నించగా తాను ఒరిజినల్ కరెన్సీ నోట్లు ఇచ్చినట్లు సీఎస్సీ నిర్వాహకుడు హైమద్ దబాయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆమె సీఎస్సీ కేంద్రం ఎదుట ఆందోళన చేపట్టారు. అక్కడికి చేరుకున్న పోలీసులు హైమద్‌ను అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సీసీ టీవీ ఫుటేజీని పరిశీలించారు. శుక్రవారం సాయంత్రానికి హైమద్ తప్పేమి లేదని, అంతా సరిగ్గానే ఇచ్చారని పోలీసులు తేల్చడం గమనార్హం.

### పారబోస్తే...ఫైన్

సిటీబ్యూరో: నిర్మాణాలు చేపట్టే సమయంలో, ఇంటి మరమ్మతులు, ఆధునీకరణ చేసే సమయంలో వచ్చే వ్యర్థాలను జీహెచ్ఎంసీ టోల్ ఫ్రీ నంబర్ ద్వారా సీ అండ్ డీ (కన్‌స్ట్రక్షన్స్ అండ్ డీమాలిషన్) ప్లాంట్లకు అప్పగించకుండా కొందరు ఖాళీ స్థలాలు, చెరువులు, నాలాల పక్కన పడేస్తున్నారు. దీంతో ఎక్కడ చూసినా.. గుట్టలు, గుట్టలుగా భవన వ్యర్థాలు దర్శనమిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే బల్దియా టౌన్‌ప్లానింగ్ విభాగం అధికారులు స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. గడిచిన నెల రోజులుగా వ్యర్థాలను డంపింగ్ వేస్తున్న 1158 డెబ్రీస్ పాయింట్లను గుర్తించారు. తరచూ వేస్తున్న దాదాపు 762 పాయింట్లను గుర్తించి సంబంధిత డంపింగ్ చేస్తున్న వారికి జరిమానాలు విధించారు.